జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

విశాలాంధ్ర-పెందుర్తి : మార్చి 14న పిఠాపురంలోని చిత్రాడ గ్రామంలో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం మహోత్సవ కార్యక్రమంలో పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త పాల్గొనాలని పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ దాట్ల కన్వెన్షన్ హాల్లో మాట్లాడారు. అనంతరం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్ ను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచకర్ల ప్రసాద్ రావు, 77వ వార్డు కార్పొరేటర్ బొట్టు సూర్య కుమారి ,మండల పార్టీ అధ్యక్షులు కోరుపోలు రామానాయుడు, కర్రి కనకరాజు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తికి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు

పోరాటల ద్వారానే సమస్యల పరిష్కారం

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు

అత్తిలి విమల

విశాలాంధ్ర-విశాఖ : మహిళా దినోత్సవం స్ఫూర్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'గౌరవప్రదమైన జీవితం ధాతృత్వం కాదు, అది మహిళల హక్కు' అన్న నినాదంతో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత పాలకుల మాటల్లోనే తప్ప చేతల్లో ఉండడం లేదని విమర్శలు చేశారు. శ్రామిక మహిళల పోరాట స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం ఓటు బ్యాంకు రాజకీయాలకు వేదికగా మారిపోతున్నదని అన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం కురిపించిన హామీలు ఒక్కటి కూడా అమలుకావడం లేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్సు ప్రయాణం, తల్లికి వందనం హామీలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. రాజ్యాంగం అందించిన సమానత్వం 75 ఏళ్ళయినా సాధ్యం కాలేదని, మహిళలపై దాడులు పెరుగుతున్నా పాలకులకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ నేర విభాగం ఇస్తున్న నివేదికలే ఆ విషయాన్నీ బయట పెడుతున్నాయని పేర్కొన్నారు. మోదీ పాలనలో మహిళా సమాజం మరో వంద ఏళ్ళు వెనక్కి వెళ్లిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు గుర్తింపు లేకుండా పోయిందని వాపోయారు. దేశంలో మనుధర్మం రాజ్యాంగంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనుధర్మమే మహిళలకు ప్రధాన శత్రువని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మహిళా దినోత్సవం అందించిన పోరాట స్ఫూర్తి తో మహిళలు మరింత చైతన్యవంతంగా ఉద్యమాల వైపు అడుగులు వేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎం ఏ బేగం మాట్లాడుతూ పాలకుల తీరు కారణంగా మహిళల జీవితాల్లో వెలుగులు లేకుండా పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా హక్కుల పరిరక్షణ మహిళా ఉద్యమాల ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె వనజాక్షి, నేతలు ఏ దేవుడమ్మ , అరుణ, అన్నపూర్ణ, జి.జయ, బి.పుష్పలత, పావని పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

వీధి విక్రయదారుల సంఘం

రాష్ట్ర కార్యదర్శి కె. సత్యనారాయణ

విశాలాంధ్ర-విశాఖ: చిరు వ్యాపారులకు అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వీధి విక్రయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గం దర్శకాల ప్రకారం హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ముద్ర రుణాలు మంజూరు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన చిరు వ్యాపారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు దొరక్క, పండించే పంట గిట్టుబాటు ధర లేక వలస వచ్చి విశాఖ నగరంలో అనేక సంవత్సరాల నుండి అద్దె ఇళ్ళలో నివాసం ఉంటూ చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై జీవీఎంసీ, పోలీసు అధికారులు పెట్టీ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారన్నారు. జీవీఎంసీ అధికారులు పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్లాస్టిక్ కవర్లు అమ్మితే వేలాది రూపాయలు జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. దీని వల్ల చిరు వ్యాపారులపై ఆర్థిక భారాలు పడతాయని అన్నారు. తయారీ వద్దే వీటిని నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుత రావు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు, ఎన్.నాగభూషణం, ఎస్. నగేష్, ఎస్.వినోద్, పి.ప్రకాష్, ఏ. అనసూయ, రాము తదితరులు పాల్గొన్నారు.

నారీమణులకు ఎమ్మెల్యే గణబాబు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అదేశాల మేరకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు కేక్ కట్ చేసి మహిళలకు మిఠాయి తినిపించారు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న మహిళలను సన్మానించి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ, మహిళా నాయకులు నరవ అనూష, పద్మావతి, మంగలక్ష్మి, లత, ఎఎస్ఐ గోవిందమ్మ, రాదా, అమ్మాజీ తదితర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-పెదగంట్యాడ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్. ఐ.డబ్ల్యు) విశాఖ జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి అన్నారు . గాజువాక జోన్ 65 వ వార్డు సంజీవ గిరికాలనీ లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మహిళా సమాఖ్య ప్రతినిధి భూ లక్ష్మి మహిళా సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు కె. వనజాక్షి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే మహిళలు అభివృద్ధి చెందుతారని అన్నారు .మహిళలు నేడు విద్య, ఉద్యోగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు.మహిళలు అభివృద్ధి చెందితేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు . మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు పిల్లా పద్మ , సభ్యులు హేమ లత, లక్ష్మి ,బానమ్మ , భూలక్ష్మి పాల్గొన్నారు.

ఆదర్శ్ లో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ వేడుకల్లో ఆదర్శ్ మహిళ సిబ్బంది విద్యార్థులు ఆటలలో పాల్గొని మహిళా దినోత్సవం వైభవంగా జరుపుకున్నారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ మాట్లాడుతూ సమాజంలో మహిళల యొక్క ప్రాధాన్యత గురించి ప్రస్తావిస్తూ మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభను కనపరుస్తున్నారని, మహిళా సాధికారత మాటల్లో కాకుండా ఆదర్శ్ లో 70% మహిళ సిబ్బంది వున్నారని తెలియజేశారు. మహిళ సిబ్బందికి బహుమతులు విద్యార్థులకు, మెడల్స్ సర్టిఫికెట్లు ప్రధానం చేసారు. వేడుకల్లో ఎన్ఎస్ఎస్ 3 యూనిట్స్ కోర్డినేటర్లు మంజుల, సంధ్యారాణి, ప్రదీప్, సింహాచలం, ఏవో రవి బాబు, కళాశాల సిబ్బంది భాగస్వామ్యం అయ్యారు.

మహిళాభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-మల్కాపురం: మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేబడుతున్న విద్య, వైద్యం, ఉపాధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలుచేయాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్కళాశాలలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ- మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందు తుందని అన్నారు. ప్రతీ కుటుంబంలోనూ బాల బాలిక లను సమానంగా పెంచాలని, మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేట్లీన్ ప్రసంగించారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన కళాశాల అధ్యాపకులు అందరినీ యాజమాన్యం ప్రశంస పత్రాలతో సత్కరించింది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలపై దాడుల్ని అరికట్టాలి

ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బేగం

విశాలాంధ్ర-విశాఖ: మహిళలపై జరుగుతున్న దాడుల్ని అరికట్టాలని, హింసలేని స్వేచ్ఛా జీవితం కోసం పోరాడాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అల్లిపురం నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. మహిళలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, మహిళా సాధికారత సమానత్వం కోసం పోరాడుతుంటే అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ దేవుడమ్మ, ఎన్ అరుణ, ఏ అన్నపూర్ణ, బి పుష్పలత, చెల్లూరు నూకాలమ్మ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు

నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య బాల మోహన్ దాస్

విశాలాంధ్ర-విశాఖ: మహిళ లపై వివక్ష పట్ల చరిత్రలో అనేక పోరాటాలు జరిగాయని, ఫలితంగా అనేక మార్పులు వచ్చాయని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య బాల మోహన్ దాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇస్కఫ్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీసెంటర్లో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా సరోజినీ నాయుడు మొదలుకొని అనేకమంది పోరాడారని తెలిపారు. ఇస్కఫ్ విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని, మెరుగైన వేతనం కోసం 1909లో న్యూయార్క్ లో 15 వేల మంది మహిళలు ప్రదర్శన నిర్వహించారని తెలిపారు. వారి డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909లో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించిందని తెలిపారు. దీన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని క్లారా జెట్కిన్ అనే మహిళ భావించారని, 1910 లో కోపెన్ హెగెన్ నగరంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ సదస్సులో ఆమె చేసిన ప్రతిపాదనను 17 దేశాల నుంచి హాజరైన వందమంది మహిళలు ఏకగ్రీవంగా ఆమోదించారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొలిసారిగా 1911 లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ ల్లో నిర్వహించారని తెలిపారు. 2011లో అంతర్జాతీయ మహిళాదినోత్సవ శతాబ్ది వేడుకలు జరిగాయన్నారు. ఇస్కఫ్‌కి మొదట్లో సరోజినీ నాయుడు వంటి వారు పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎంఏ బేగం, ఆంధ్ర విశ్వ కళా పరిషత్ లా కళాశాల ప్రిన్సిపాల్ కే రాజమాణిక్యం, లెక్చరర్ రమణిలను సన్మానించారు. కార్యక్రమంలో టిఎస్ సుకుమారన్, రాంప్రభు, అహ్మదున్నీసా బేగం, సిహెచ్ మధుబాబు, జిఎస్ సూర్యకుమారి, వై సత్యవతి, ఎం ఎస్ పి లహరి, పుష్పలత, ఎం.మధువతి, పి. నాగలక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

రూ. 2కోట్ల అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గణబాబు..

విశాలాంధ్ర-గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డ్ గోపాలపట్నం రామకృష్ణ నగర్ కాళీమాత అమ్మవారి ఆలయనికి వెళ్లే మార్గంల్లో గత ఏడాది భారీగా కురిసిన వర్షాలు కారణంగా కొండచరియలు విరిగి పడ్డాయి. నాడు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు కృషితో సుమారుగా రూ.2 కోట్లుతో మళ్లీ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతగా ఉండే విధంగా రిటర్నింగ్ వాల్ ను మంజూరు చేశారు. కొండవాలు ప్రాంతంలోజరుగుతున్న పనులను శనివారం గణబాబు జీవీఎంసీ అధికారులు మరియు స్థానిక నాయకులుతో స్వయంగా వెళ్లి పరిశీలించారు పనుల యొక్క నాణ్యత విషయంలో రాజీ పడద్దని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా స్థానిక కొండవాలు ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారిపిన్ని సత్తిరాజు,కూటమి నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా...!

విశాలాంధ్ర-గోపాలపట్నం: గవర జగ్గయ్యపాలెంలో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు కనబడితే చాలు ఆక్రమించేస్తున్నారు. తాజాగా ఓ నిర్మాణం కోసం కొందరు సుమారు 300 గజాల స్థలంలో పునాదులు చేపట్టారు. ఈ స్థలం విలువ సుమారు రూ.30 లక్షలు పైమాటేనని స్థానికులు అంటున్నారు. ఇలా 100, 200గజాలలో ప్రభుత్వ స్థలాలలో పునాదులు నిర్మించి ఆక్రమణ దారులు సొమ్ము చేసుకుంటున్నారు ఈ నిర్మాణలు చేపట్టినచోట భూగర్భంలో మంచినీటి పైపులైన్లు ఉన్నాయని, వాటిని ప్రస్తుతం వినియోగించకపోవడంతో ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది కబ్జా రాయళ్లు సిద్ధపడ్డారని అంటున్నారు. జీవీఎంసీ మరియు రెవెన్యూ అధికారులకు ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం గమనార్హం. దీనిపై స్థానిక సచివాలయ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే అక్రమార్కుల ఆగడాలకు అడ్డు లేకపోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణ తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికలు కోరుతున్నారు.

సింహాద్రినాధుని దర్శించుకున్న రిటైర్డ్ ఐఏఎస్ రమేష్‌కుమార్

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారికి డాక్టర్ ఎన్ రమేష్ కుమార్, ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్) డైరెక్టర్ జనరల్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ వారు కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్య నిర్వహణ అధికారి కె .సుబ్బారావు ఘన స్వాగతం పలికారు. ముందుగా కప్ప స్తంభము ఆలింగనం, బేడా మండపము ప్రదక్షిణ చేశారు. తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చెప్పి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరము అమ్మవారి దర్శనము తదుపరి నాదస్వర వేద మంత్రాలతో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను కార్యనిర్వహణాధికారి అందజేశారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసరాజు, డిప్యూటీ కమిషనర్ రాధ, సహాయ కార్య నిర్వహణ అధికారి ఎన్ ఆనంద్ కుమార్ ఆలయ పర్యవేక్షణ అధికారి జీ.వి.ఎస్. కే. ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మహిళల సాధికారతకై మాట్లాడవలసిన అవసరం ఉంది

జిల్లా ఇంచార్జి మంత్రి డా.డోల బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగులు & సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి డా.డోల బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం స్థానిక ఉడా చిల్డ్రన్ ఏరీనాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోల బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో విజయాలను సాధించిన మహిళలను గుర్తించి వారిని గౌరవించి, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రోత్సహించాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన చేకూర్చు కునేందుకు షియో ఆటోలను, ద్విచక్ర వాహనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆన్లైన్ అమ్మకాల్లో రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలు లింకా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించబోతుందని ఇన్చార్జి మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇంత పెద్దస్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఉన్నత స్థితికిచేరేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుం దని తెలిపారు. జిల్లాలో రేపిడో ద్వారా 200 మహిళలు ఉపాధి కల్పిస్తు న్నామని, భీమిలిపట్నం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ చరిత్ర లో మహిళకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విశాఖ పోలీస్ కమిషనర్ శంఖ బ్రాత బాగ్చి మాట్లాడుతూ దేశ రక్షణలో మహిళలు ముందుంటున్నారన్నారు. అనంతరం కళాకారులు, చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. అనంతరం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చెక్కులను పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీలు, క్రీడలు వివిధ అంశాలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను మెమెంటోలను అందజేశారు.సాంస్కృతిక కార్యక్రమా లలో పాల్గొన్న చిన్నారులకు మెమెంటోలను బహుకరించారు. కార్యక్రమం లో విశాఖ తూర్పు శాసనసభ్యులు రామకృష్ణబాబు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సహకార ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గండి బాబ్జి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎం రామలక్ష్మి రాధా, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జి చిన్నయిదేవి, విశాఖ జిల్లా సమాఖ్య అధ్యక్షులు వై గంగాభవాని, జిల్లా సమైక్య సెక్రెటరీ పి నూరమ్మ, ఇతర జిల్లా అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ వాసవి ఆలయ ప్రాంగణంలో రేపు ఆలయసముదాయ శంకుస్థాపన

ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే గంటా, ఎంపీ. భరత్

విశాలాంధ్ర-మధురవాడ: జీవీయంసిజోన్. 2మధురవాడ, వైయస్ఆదర్స్ నగర్, రోడ్‌లోగల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో 10వ తేదీ సోమవారం ఉ.9:21 నిమిషాలకు శ్రీ వెంకటేశ్వర, శ్రీ పంచముఖేశ్వర ఆలయ సముదాయాలకు శంకుస్థాపన నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆ ఆలయం వద్ద, ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ సేవా సంఘం, మధురవాడ ఆర్యవైశ్య సేవా సంఘం ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు వేటూరి.వెంకటేశ్వరులు (వెంకటేశ్వర విద్యాసంస్థల అధినేత), తదితరులు మాట్లాడుతూ మధురవాడలో అనేక సం,, లుగా పూజలు అందుకుంటున్న ప్రజల ఇలవేల్పు శ్రీవాసవి మాత ఆలయ ప్రాంగణంలో ఆలయ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహాశివ, శ్రీ వెంకటేశ్వర స్వామి,తదితర ఆలయాలకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమ ముహూర్తాన్ని స్వయంగా అమ్మవారే, భక్తులపైనా, పూజారి పైనా పూని నిర్ణయించటం, తమపూర్వజన్మ అదృష్టమని తెలిపారు.బ్రహ్మశ్రీ వేమకోటి సూర్యనారాయణ శర్మ (గరివిడి) పర్యవేక్షణలో జరుగ నున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ ఎంపీ ఎం శ్రీ భరత్, విశిష్ట అతిథిగా భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాస్ లు హజరుకానున్నారని తెలిపారు.

సమాజాభివృద్ధిలో మహిళలది కీలకపాత్ర

నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి

విశాలాంధ్ర-విశాఖ సిటీ : సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్రని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షరాలు పేడాడ రమణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి, రెడ్డి వైయస్సార్ సిపి నాయకులు తిప్పల దేవన్, డిప్యూటీ మేయర్ జియాని శ్రీధర్, పలువురు కార్పొరేటర్లు వైయస్సార్ సిపి నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. స్త్రీ లేనిదే జననం లేదు స్త్రీ లేనిదే జగత్తు లేదు యావత్ సమాజానికి మహిళలే మూలమని తెలిపారు. అలాంటి మహిళపై ఇప్పటికీ అక్కడక్కడ అన్యాయాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలు ఇటు ఇంటిని చక్కదిద్దుతూ మరో ప్రక్క ఉద్యోగాలు చేస్తున్నారని అంతట ఓర్పు స్త్రీ మూర్తికే ఉందని పేర్కొన్నారు. ప్రతి ఏట మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని, ఈ సందర్భంగా మహిళ లందరికీ మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలం దరికీ సన్మాన కార్యక్రమం తో పాటు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నారీమణులకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మందుబాబులకు రూ.3 లక్షలు జరిమానా

విశాలాంధ్ర-పెందుర్తి: మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 30 మందిపై కేసులు నమోదు చేసినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలియజేశారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టి నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 30 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి 10000 చొప్పున 3 లక్షల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గాను ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త వాహన చట్ట ప్రకారం అందరూ తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.

గోస్తనీ విద్యాపిఠ్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలంలో గోస్తనీ విద్యాపీఠ్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా దినోత్సవ వేడుకలను గోస్తని విద్యాపీఠ్ లో గోస్తనీ విద్యాసంస్థల అధినేత కాళ్ళ సూరిబాబు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. పద్మనాభం పంచాయతీ సర్పంచ్ కు, ఎంపీటీసీ కు , పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు, మరియు పద్మనాభం పంచాయతీ మహిళా పారిశుధ్య కార్మికులకు ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల పట్ల గౌరవభావాన్ని అందరూ పెంచుకోవాలని, ప్రతి రంగంలో వారికి అవకాశాలను ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీ పద్దు, పాఠశాల డైరెక్టర్ కాళ్ల మనోహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం పైడిరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏయు వీసి రాజశేఖర్ ను ఆశీర్వదించిన బ్రహ్మకుమారీస్

విశాలాంధ్ర-పెందుర్తి : నూతనంగా అధికారిక బాధ్యతలు చేపట్టిన ఆంధ్ర యూనివర్సిటీ ఆచార్యులు, వైస్ ఛాన్సలర్ జీపి రాజశేఖర్ ను పెందుర్తి మండలం, పురుషోత్త పురంకు చెందిన బ్రహ్మకుమారిస్ ఈశ్వరియ విశ్వవిద్యాలయం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వచనం, శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే విశాఖ రీజినల్ వైద్య, ఆరోగ్య అధికారిని పి. రాధారాణికి బ్రహ్మకుమారీలు శుభాకాంక్షలు, ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సత్యవతి, రోచస్నీ బ్రహ్మ కుమారులు సన్యాసి రావు యోగ టీచర్, ఈశ్వర్ పురుషోత్తం పురం ప్రాంతానికి చెందిన పలువురు బ్రహ్మకుమారిస్ పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నయం

92వ వార్డు మహిళా కార్పొరేటర్ బివివిఎస్ దేవి

బ్రెస్ట్ క్యాన్సర్ పై ఉచిత అవగాహన సదస్సు

బెహరా లొ ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గోపాలపట్నం: బ్రెస్ట్ క్యాన్సర్ ను ముందుగా గుర్తిస్తే దానిని సులభంగా నయం చేయవచ్చని 92 వ వార్డు మహిళా కార్పొరేటర్ బివి విఎస్ దేవి (బెహరా స్వాతి) అన్నారు. సూర్యుడు ఉదయించక ముందునుండే మనం లేచి సపర్యలు చేసి సూర్యుడు అస్తమించినా కూడా మన పని మనం చేసుకుంటునే ఉంటున్నామని అందుకు మనకు మనమే సాటి అని మహిళా దినోత్సవం సందర్భంగా గుర్తుచేస్తున్నానని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బెహరా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. బెహరా రవితేజ ఆదేశాలమేరకు బెహరా ఆసుపత్రి ప్రాంగణంలో బ్రెస్ట్ క్యాన్సర్ పై ఉచిత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 34, 91, 92 వార్డుల మహిళా కార్పొరేటర్లు తోట పద్మావతి, కుంచె జ్యోష్ణ, బివివిఎస్ దేవి లు పాల్గొన్నారు. ముందుగా బెహరా ఆసుపత్రి కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా. ప్రవీణ్య మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ పై వీడియో ప్రెజెంటేషన్ ద్వారా క్యాన్సర్ ను ఎలా గుర్తుపట్టాలో వివరించారు. వంశపారపర్యంగా ఎక్కువుగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, అలాగే మనం తినే ఆహారం తొ కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ఆధునిక యుగంలో పురుషులతో పాటు మహిళలు కూడా సమానంగా పనిచేస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మహిళలు తమ ఆరోగ్యం వట్ల, ఆహారపు అలవాట్ల పట్ల కూడ శ్రద్ధ చూపాలని దీని ద్వార క్యాన్సర్కు దూరంగా ఉండగలుగు తామని తోట పద్మావతి అన్నారు. ఒకప్పుడు అక్షర్యాతిలో వెనుకబడిన మహిళలు ఇప్పుడు పురుషులతొ సమానంగా చదువుకుంటున్నాము కాబట్టి బ్రెస్ట్ క్యాన్సర్ పై ప్రతీ మహిళ అవగాన పెంచుకుని దానిని నిర్మూలించే దిశగా ప్రకారం చేయాలని కుంచే జోష్ణ అన్నారు. అనంతరం మహిళా కార్పొరేటర్లను రవితేజ శాలువతొ సన్మానించారు. కార్య క్రమంలో న్యూట్రిషన్ డా. సృజని అధికసంఖ్యలో మహిళలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీజెపి కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళ నాయకులు కార్యకర్తలు పార్టీ నాయకులు హాజరైనారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ మహిళా సాధికారత, సమానత్వం 33% రిజర్వేషన్ మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ పథకాలు పురోగతి అభివృద్ధి మహిళలకు ప్రత్యేకంగా లబ్ధి చేకూర్చే పథకాలు గురించి వివరించారు. అన్ని రంగాలలోను మహిళలు రాణించి ఆంధ్ర రాష్ట్రాన్ని ముందుకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా ఓబీసీ నాయకులు కంచిపాటి సన్యాసిరావు ఎస్సీ మోర్చా నాయకులు భూపతి అప్పారావు స్మాట్, పెందుర్తి అసెంబ్లీ కో కన్వీనర్ రెడ్డి రామానాయుడు ఓబిసి సెల్ నాయకులు రాజేష్, క్రైట్స్ స్కిల్స్ శేషగిరి సావిత్రి సుభాని రమేష్ భారతీయ జనతా పార్టీ మహిళా నాయకులు గోర్లె చిన్నమ్మలు, పార్వతి ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ పురస్కరించుకొని ముఖ్యఅతిథిని దుశాల్వతో సత్కరించి మొక్కని ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక పారిశుద్ధ కార్మికురాలికి దుస్సాల్వతో సత్కరించడం జరిగింది.

మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

జిల్లా ఇన్చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-విశాఖ సిటీ : మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని జిల్లా ఇన్చార్జి మంత్రి డోల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ , జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి . కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇన్చార్జ్ మంత్రి మాట్లాడుతూ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత మహిళలకు ఆస్తి హక్కును కల్పించారు అని గుర్తు చేశారు. స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు అని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షిస్తున్నారని, మహిళా సంక్షేమం, సాధికారత లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాము. కూటమి విజయంలో మహిళలు కీలక పాత్ర పోషించారు అని ప్రశంసించారు. మహిళ సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది అని తెలిపారు . కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తోట రత్నం , జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి , మహిళా ప్రధాన కార్యదర్శి గణగళ్ళ సత్య, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత , రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కురిమిన లీలావతి , విశాఖ దక్షిణ నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు కేదారి లక్ష్మి , భీమిలి మాజీ జెడ్పిటిసి బోరా రాధాకుమారి , ముక్కా ఈశ్వరి , ఈసారపు వెంకటలక్ష్మి తదితరులకు మంత్రి బాల వీరాంజనేయ స్వామి గండి బాబ్జి సన్మానించారు.

రోప్ వే యాజమాన్యానికి రూ.50వేలు జరిమానా

సామర్థ్యం పరిశీలించిన తరువాతే కేబుల్ కార్ కి అనుమతి

వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్ ఆదేశాలు

విశాలాంధ్ర-విశాఖ: కైలాసగిరి పై వ్యర్థాలను సకాలంలో తొలగించకుండా అగ్ని ప్రమాదానికి కారణమైనందుకు రోప్ వే యాజమాన్యానికి రూ.50వేలు జరిమానాను వీఎంఆర్డీఏ విధించింది. ఈ జరిమానాను వారం రోజుల్లో కట్టాలని కార్యదర్శి పి మురళీకృష్ణ ఆదేశించారు. రోప్ వే వద్ద ప్రమాద స్థలాన్ని వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్ శనివారం సందర్శించి, జరిమానాకు ఆదేశించారు. ఈ సందర్భంగా రోప్ వే సామర్థ్య ధ్రువపత్రాలు సమర్పించిన తరువాతే కేబుల్ కార్ తిరిగేందుకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. కైలాసగిరి పై గ్లాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించి వేసవి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వేసవిలో పర్యాటకులు తాకిడి అధికంగా ఉంటుందని అందువల్ల మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. కైలాసగిరి ప్రవేశ ద్వారం వద్ద కైలాసగిరి మ్యాప్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కైలాసగిరి పై మరిన్ని అడ్వంచర్ జోన్ లు ఏర్పాటు, కైలాసగిరి కొండపై రాకపోకలు సాగించేందుకు డబుల్ డెక్కర్ బస్సులు త్వరలో ప్రవేశ పెట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులని ఆదేశించారు. తెన్నేటి పార్కు వద్ద కొత్తగా జిప్ లైనర్, స్కై డైవింగ్ ఏర్పాటుకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం హెల్త్ ఎరీనాలో వాకింగ్ ట్రాక్ ను సందర్శించారు. అక్కడ మరుగుదొడ్లకు, పాడైన వ్యాయామ పరికరాలుకు సత్వరమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. వాకర్స్ తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కమిషనర్ కె రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ , పర్యవేక్షక ఇంజినీర్ భవాని శంకర్, కార్యనిర్వహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అరుణ్ కుమార్ ను పరామర్శించిన బెహరా భాస్కర్

విశాలాంధ్ర -గోపాల పట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు ఎస్సీ బీసీ కాలనీలో నివాసం ఉంటున్న నేతిపూడి అరుణ్ కుమార్ ఇటీవల కరెంట్ షాక్ తగిలి అనారోగ్యంతో ఇబ్బంది పడు తున్నందు వలన వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు బెహరా భాస్కర రావు పరామర్శించి, అతని ఆరోగ్యపరిస్థితి తెలుసుకొని, తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 92 వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కంపర కోటీశ్వరరావు, మల్లేటి భీమయ్య, ఎద్దు దేవుళ్ళు, కంపర వెంకటరమణ, గొడ్డు నాగరాజు, బలిరెడ్డి శ్రీను, అట్టా శంకర్ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లా భరత్ కుమార్ మెమోరిల్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

హాజరైన ఎమ్మెల్యే గంటా..

విశాలాంధ్ర-మధురవాడ : పల్లా భరత్ కుమార్ మెమోరియల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జీవీయంసీ, జోన్. 2. మధురవాడ పిల్లకోమటి వాని పాలెంలో మెగా రక్తదాన, వైద్యశిబిరం, వాలీబాల్ పోటీలు, అన్న సమారాధన, పేదలకు వస్త్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు పిల్లవెంకట్రావు,పిల్ల మంగమ్మ (7వ వార్డ్ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు) కుమారుడు కీ.శే. పిల్ల భరత్ కుమార్(నాని) 31వ జయంతి సందర్భంగా గీతం జిమ్సర్ వైద్యబృదం ద్వారా మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరం, పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం తమ కుమారుని జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థ ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు కార్యక్రమానికి హజరయ్యారు.

వైసీపీ నాయకులను సత్కరించిన హేమంత్ కుమార్

విశాలాంధ్ర-పెందుర్తి : అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన బోద్దపల్లి హేమంత్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు బూడి ముత్యాల నాయుడు,పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ, మాజీ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బీసెట్టి సత్యవతి , పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజ్ లను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అనకాపల్లి పార్టీ కార్యాలయంలో సీనియర్ నేతలను కలిసి తనకు పదవి లభించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పులేటి వెంకటేష్ ,పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, వంగలి ఎంపీటీసీ గవర రాజు, 77వ వార్డు సీనియర్ నాయకులు బట్టు పైడి రెడ్డి, హరి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమాన

45 మందికి నాలుగు లక్షల 50 వేలు

ఫైన్ విధించిన భీమిలి కోర్ట్

విశాలాంధ్ర-ఆనందపురం : అనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పట్టుబడ్డ 45 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ డి .సౌజన్య ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున 45 మందికి నాలుగు లక్షల 50 వేల రూపాయలు అపరాధ రుసుము విధించారని ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ పాపారావు తెలిపారు.

భాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో అమ్మ కు వందనం

విశాలాంధ్ర -పెదగంట్యాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్ నందు అమ్మ కు వందనం కార్యక్రమం దిగ్విజయం గా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం లో విద్యార్థులను వారి తల్లులను ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ నేటి మహిళలు పురుషులతో సమానంగా సమాజం లో అన్ని రంగాల్లోను రానిస్తున్నారని, కానీ తగిన గుర్తింపు రావడం లేదని కనుక వారికీ సమాన హక్కులు కల్పించి గౌరవించాలని సూచించారు. స్త్రీ తల్లిగా, భార్యగా, అక్కగా, చెల్లిగా, కూతురిగా జీవితం లోని ప్రతీ పాత్రను అత్యద్భుతంగా పోషిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల 3,4 తరగతి చిన్నారులచే వారి వారి తల్లులకు పాద పూజ చేయించి అమ్మకు వందనం అనే కార్యక్రమం నిర్వహించి ప్రతీ మనిషి జీవితం లో అమ్మ పాత్ర ప్రముఖమైనదని ప్రతిరోజూ విద్యార్థులంతా తల్లి పాదాలకు నమస్కరించి,ఆమె ఆశీర్వచనాలు నిత్యం అందుకొని మంచిభవిష్యత్ ను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల లోని సీనియర్ ఉపాధ్యాయిని శ్రీమతి పైల. పద్మావతి ని పాఠశాల కరెస్పాండెంట్ రమాదేవి మరియు ఇతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 5,6 తరగతుల చిన్నారులు అమ్మ పై పాడిన పాటలు, డాన్సులు తల్లులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, మహిళా ఉపాధ్యాయినులు శిరీష,రాణి, దివ్య, శైలజ, సునీత తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని జీవీఎంసీ 93 వ వార్డు నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి చేస్తున్న సేవలను కొనియాడుతూ ఆసుపత్రి పురోభివృద్ధిలో భాగస్వాములైనందుకు అభినందించారు. ఆసుపత్రిలోని మహిళా ఉద్యోగులు వైవిధ్యమైన బాధ్యతలు నిర్వహిస్తూ కంటి రోగులకు సేవలుచేస్తూ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి మంచి పేరుప్రఖ్యాతులు తీసుకొని వస్తున్నందుకు ప్రశంసించారు. అత్యంత ప్రతిభ కనిపరచిన సీనియర్ డాక్టర్లు , మహిళా ఉద్యోగులను ఆత్మకూరి కృష్ణ కుమార్ సత్కరించారు. కార్యక్రమంలోడాక్టర్ రవీంద్ర, డాక్టర్ కృష్ణ , కె .బంగారు రాజు , వేణుగోపాల్ డిజిఎంలు , ఎస్ కే ఎల్ రావు ఏజిఎం, అధిక సంఖ్యలో డాక్టర్స్ మహిళా ఉద్యోగులు , విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 300 మహిళా ఉద్యోగులు ,డాక్టర్లు ఏంతో ఉత్సాహంగా పాల్గొని అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను ఉర్రుతలూగించారు. ఈ వేడుకల్లో లక్కీ డిప్ తీసి, గెలిపొందిన మహిళలకు బహుమతులు ముఖ్య అతిథి కృష్ణ కుమార్ ప్రధానం చేసారు. ఈ కార్యక్రమాన్ని రాజశేఖర్, ప్రవల్లిక , పావని మానవ వనరుల విభాగం , కాలేజీ మహిళా ఉపాధ్యాయులు అలేఖ్య, నిర్వహించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

పలువురు మహిళలను సన్మానించిన అధికారులు

విశాలాంధ్ర -ఆనందపురం: ఆనందపురం మండలంలోని గంభీరం గ్రామపంచాయతీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు.విశాఖపట్నం జిల్లాలో ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామపంచాయతీగా గంభీరం గ్రామ పంచాయితీ ఎంపిక కావడంతో గ్రామపంచాయతీలో ఉత్తమ సేవలందించిన సచివాల, శానిటేషన్ సిబ్బందినీ శానిటేషన్ సిబ్బందిని సన్మానించారు. గ్రామపంచాయతీలో గర్భిణీ స్త్రీలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ జానకి ,ఎంపీపీ శ్రీమతి మజ్జి శారదా ప్రియాంక, గంభీరం సర్పంచ్ శ్రీమతి వానపల్లి లక్ష్మీ సీమంతం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వి ఏ శ్రీనివాసరావు ఎంపీడీవో డాక్టర్ శ్రీమతి జానకి , ఎంపీపీ శ్రీమతి మజ్జి ప్రియాంక , సర్పంచ్ శ్రీమతి వానపల్లి లక్ష్మి, ఈ కార్యక్రమానికి పరిశీలకునిగా శ్రీ వి శ్రీనివాసరావు , పంచాయతీ కార్యదర్శి కే చలపతిరావు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో గాయత్రి డిగ్రీ కాలేజ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-అనందపురం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన మూడు, 5వ సెమిస్టర్ల ఫలితాల్లో ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రధాన చార్యులు దుక్క అప్పలరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ బెల్లం రామకృష్ణ మాట్లాడుతూ. విద్యార్థుల నిరంతర అభ్యాసన ద్వారా మంచి మార్కులను సాధించవచ్చు అన్నారు. విద్యా నైపుణ్యాలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు అన్నారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే డిగ్రీ స్థాయి నుంచి సబ్జెక్ట్ పై నిరంతర సాధన అవసరమన్నారు. సందర్భంగా 3వ సెమిస్టర్ లో ప్రథమ స్థానంలో నిలిచిన కడియం దేవి(బిఎస్సి), ద్వితీయస్థానంలో నిలిచిన కొట్యాడ రమ్య (బిఎస్సి) , తృతీయ స్థానంలో లంక విష్ణు కుమార్ అభినందించారు. 5వ సెమిస్టర్ లో తమ్మిన గణేష్ మొదటి స్థానంలో నిలువగా, బూర్ల సాయి లక్ష్మి, దుక్క పావని ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి సునీత, టి పద్మ, సూర్యకుమారి, బంటుబిల్లి సత్యనారాయణ, తాతారావు, అఖిల, ఈశ్వరరావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.